క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్సీ దువ్వాడ


కప్పస్తంభం వద్ద ఎమ్మెల్సీ దువ్వాడ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ శ్రీనివాస్ అందజేశారు.

450 మందికి వైద్య పరీక్షలు


బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 450 మందికి స్పెషలిస్టు వైద్యులు సేవలు అందించారు. బీపీ, సుగర్ టెస్టులు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, నాయకులు పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు, జగదీష్, ఎన్.అప్పారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో పాఠశాల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

పరవాడ: గోవాలోనిర్వహిస్తున్న 37వ నేషనల్ గేమ్స్ జాతీయ క్రీడల్లో స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్ రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన స్ఫూర్తీ రాణి ప్రధాన్, శిఫా పాతిమాలను పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి అభినందించారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు పాల్గొన్నారు.

15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి

పరవాడ: విజయవాడలో ఈ నెల 15న నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగసభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు వి.వి.రమణ కోరారు. మండల కాంప్లెక్స్ కూడలిలో బుధవారం గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విభజన హామీలు అమలు చేయాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీ తీరని అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వరలక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: విద్యుత్ లైన్ల నిర్వహణ దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. దువ్వపాలెం, ఎస్ఆర్‌పురం, కేదారివానిపాలెం, భైరవవాక తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

స్టాక్ మార్కెట్‌పై అవగాహన

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్' అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఐఎస్ఎం ట్రైనర్ ఎం.శ్రీను విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి, కామర్స్ హెచ్‌వోడీ ఎం.గోవిందరావు, అధ్యాపకురాలు బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే శ్రీరామ రక్ష


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


గండివానిపాలెంలో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు, నాయకులు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఉత్సాహంగా గడప గడపకు..

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామరక్షగా నిలుస్తాయని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం గండివానిపాలెం గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నాయకులు గజమాలతో సత్కరించారు. పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెం, పచ్చిగోరివానిపాలెం, గండివానిపాలెం, మార్కెండేయ నగర్ కాలనీ గ్రామాల్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను స్వయంగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సగటున ప్రతీ కుటుంబానికి రెండు లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని చెప్పారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ పథకాలు అమలు చేశారని చెప్పారు.ఇంటి స్థలం, అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, విద్యా కానుక, వైఎస్సార్ చేయూత, జగనన్న గోరు ముద్ద, రైతు పంటల బీమా వంటి పథకాలు అమలు చేయడంతో ప్రతీ ఇంటా చిరునవ్వులు చిందుతున్నాయన్నారు. ఏ గడపకు వెళ్లినా తమకు ప్రజలు సాదర స్వాగతం పలుకుతున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పల్లా అప్పారావు, ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, కన్నూరు ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు, నందవరపు శ్రీనివాసరావు, యలమర్తి బుజ్జి, ఒమ్మి అర్జునరావు, సచివాలయ కన్వీనర్ అలమండ నారాయణరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలవలపల్లి సత్యనారాయణ, పెందుర్తి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


హాజరైన నాయకులు, కార్యకర్తలు

- జగనన్న బాటలో జనం–మా ధైర్యం మా జనం నినాదంతో ప్రజల్లోకి..
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి: ఈ నెల 9న ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. జగనన్న బాటలో జనం–మా ధైర్యం మా జనం' నినాదంతో ముందుకు వెళతామని చెప్పారు. జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో 'ఏపీకి జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమంపై బుధవారం వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా పల్లె నిద్ర చేయడంతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. నాడు టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకుతింటే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల చెంతకే పథకాలు చేరవేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించా లని దిశానిర్దేశం చేశారు. పార్టీ మండల, వార్డు అధ్యక్షులతో పాటు ముఖ్య నాయకులు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, జోన్–8 జేసీఎస్ కన్వీనర్ మనాలత జోబ్‌దాస్, వార్డుల అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, దాసరి అన్నపూర్ణ, వరంబాబు, నాయకులు కోరాడ చందుయాదవ్, రామరాజు, సూరిశెట్టి సూరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం


మందులు అందిస్తున్న ముమ్మన దేముడు


వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం, సూర్యానగర్, ఎస్ఏడీ లేఅవుట్, ఎల్ఐసీ కాలనీ, భవానీనగర్ సచివాలయం పరిధిలోని ప్రజల కోసం పురుషోత్తపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. దాదాపు 350 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దేవిశ్రీ, నాయకులు పేరూరి చినబాబు, రోమాల నూకరాజు, ప్రసన్నలక్ష్మి, వరూధిని, బొడ్డు ప్రసాద్, బల్లంకి శివ, గొకివాడ బుజ్జి, జొన్నాడ సాయికృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట సమీపంలోని కృష్ణానగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ ఎం.ఎం నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ మూర్తి, ఏపీడీ శ్రీరామ్, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం వైభవంగ4ఆ జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కష్టపడితే విజయం తథ్యం

- అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్


శిక్షణ అధికారులను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

పెందుర్తి: అంకితభావంతో కష్టపడి సాధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. వేపగుంటలోని గిరిజన శిక్షణ సంస్థలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్ చదువుతున్న విద్యార్థుల విజయాలు మిగిలిన యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు క్రమశిక్షణ, అంకితభావం ముఖ్యమన్నారు. సమయం ఉన్నప్పుడు ఆంధ్రా మెడికల్ కళాశాలలోని లైబ్రరీని సందర్శించి అక్కడ వైద్య విద్యార్థులు చదువుతున్న విధానాన్ని పరిశీలించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీ రోజూ పత్రికలను ఒక పాఠ్యాంశంగా చూడాలన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ప్రభుత్వ కొలువులు సాధించడమే లక్ష్యంగా యువత ముందడుగు వేయాలని చెప్పారు. ఐటీడీఏ అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 65 మంది యువతను ఎంపిక చేసి 9 నెలల పాటు శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణకు సహకరిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవోలు ఎల్.రజని, అఖిలారెడ్డిలను ఘనంగా సత్కరించారు. అనంతరం శిక్షణకు ఎంపికైన విద్యార్థుల డార్మెటరీని ప్రారంభించారు. 21వ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అల్లూరి కలెక్టర్ సుమిత్‌కుమార్

పెందుర్తి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వేపగుంటలోని గిరిజన యూత్ శిక్షణ కేంద్రంలో బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి వి.ఎస్ ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది అన్నారు. అధ్యాపకులు ఎస్.సత్యనారాయణ, గోవిందరావు, లక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

గణపతికి అభిషేకం


విశేష అలంకరణలో గణపతి

సింహాచలం: సంకటహర చతుర్థిని పురస్కరిచుకుని బుధవారం విజినిగిరిపాలెంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో గణపతికి విశేషంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ తదితరులు పూజలు నిర్వహించారు.

వైకుంఠ వాసుడి సన్నిధి అభివృద్ధికి చర్యలు


వైకుంఠ వాసుని సన్నిధి వద్ద పరిశీలన చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఇంజనీరింగ్ అధికారులు

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి సన్నిధి అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సింహగిరిపై మైక్రోటవర్‌కు వెళ్లే అటవీ ప్రాంతంలో ఉన్న వైకుంఠవాసుడి సన్నిధిని బుధవారం ఈవో పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి భక్తులు సందర్శించే విధంగా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అలాగే సింహగిరిపై జీఆర్‌టీ సంస్థ ఏర్పాటు చేయనున్న శంఖు,చక్ర నామాల వివరాలను ఇంజనీరింగ్ అధికారులు ఈవోకు వివరించారు. అనకాపల్లి– ఆనందపురం జాతీయరహదారిలో ప్రయాణించే వారికి ఈ నామాలు కనిపించే విధంగా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈ రామరాజు ఈవో వెంట ఉన్నారు.

వీరుల త్యాగం వృథా కానివ్వం


993వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 993వ రోజు బుధవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శమన్నారు. అమరజీవి స్ఫూర్తితో పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని కేంద్రప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేవరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ


పెదనాయుడుపాలెంలో కొలువుదీరిన అమ్మవారు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెంలో కొలువుదీరిన దుర్గాదేవి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భారీ ఎత్తున సారె ఊరేగించారు. పిండివంటలు, మిఠాయిలు, వివిధ రకాల ఫలాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ముందుగా అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు జరిపారు. గ్రామపెద్దలు సబ్బవరపు బుజ్జి, గొర్లి శ్రీను, ఎస్.నాగేంద్ర, శరత్, బోకం రామకృష్ణ, లాలం సతీష్, గొర్లి భాను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ తెంటుకు ఉత్తమ అవార్డు


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తెంటు శ్రీనివాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వామివారి వార్షిక కల్యాణోత్సవంలో జరిగే కొట్నాల ఉత్సవంలో పసుపు దంచుతున్న సమయంలో ఫొటోగ్రాఫర్ తెంటు శ్రీనివాస్ తీసిన ఫొటోకు ఉత్తమ అవార్డు లభించింది. ప్రపంచ ఫొటో జర్నలిజం డేను పురస్కరించుకుని ఏపీ స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటో గ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఇండియా సంయుక్తంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు చేతులమీదుగా ఫొటో గ్రాఫర్ తెంటు శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. అవార్డుకు ఎంపిక చేసిన ఐఐపీసీ, పీఏఐలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన అవార్డులను శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి అంకితమిస్తున్నట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు.

8న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి


బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంతో పాటు నాడు విశాఖ ఉక్కు ఉద్యమంలో విశాఖ నగరంలోని ఒక విద్యార్థి కాల్పులకు మరణించారని గుర్తు చేశారు. ఉక్కు ఉద్యమంపై ప్రజలు, విద్యార్థులు, యువజనులు కలిసి ఉద్యమిస్తే ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకుంటాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు యు.ఎస్.ఎన్.రాజు, ఎల్.జె.నాయుడు, ఎస్.ఎస్.పవన్, జైజాన్సన్‌బాబు, అఖిలేష్, లెనిన్ బాబు, అభిశ్రీ తదితరులతో పాటు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, వైటీ దాస్, సీహెచ్.సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, డి.సురేష్‌బాబు, బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి అధ్యాపకుల సదస్సు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమ పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై గురువారం నుంచి మూడురోజుల పాటు వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఈ సదస్సును నిర్వహిస్తారు.కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రగతిలో భాగస్వాములు కావాలి

- ఉద్యోగులతో వీసీ ప్రసాదరెడ్డి


ఉద్యోగులనుఉద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. త్వరలో ఏయూను నాక్ కమిటీ సందర్శిస్తుందని, కమిటీ అందించే ర్యాంక్ రానున్న ఆరు సంవత్సరాలకు ఏయూకి ఎంతో కీలకంగా నిలుస్తుందన్నారు. త్వరలో శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న ఏయూ మరింత శోభాయమానంగా అన్ని రంగాలలో ప్రగతి సాధించాలన్నారు. దశాబ్దాలుగా నిరాదరణకు గురైన ఏయూ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ని దాతల సహకారంతో పూర్తిస్థాయిలో ఆధునికీకరించామన్నారు. ఈ నెల 22న సినీ నటుడు అక్కినేని నాగార్జున దీనిని ప్రారంభిస్తారన్నారు. ఇదే వేదికపై 1960లో కులగోత్రాలు సినిమా చిత్రీకరణ జరిగిందని, ఆ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు నటించారన్నారు. విశ్వవిద్యాలయం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో విభిన్న నూతన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఏయూలో స్థాపించిన ఇంక్యుబేషన్ సెంటర్‌లో 124 సంస్థలు పని చేస్తున్నాయన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎలిమెంట్ వంటివి భవిష్యత్తులో వర్సిటీకి ఆదాయ వనరులుగా నిలుస్తాయన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వద్ద నూతనంగా చెరువు తవ్వించామని, దీనిని చినజీయర్ స్వామి ప్రారంభిస్తారన్నారు. త్వరలో భౌతిక శాస్త్ర విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తామని, నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపడతామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనాలను గుర్తించి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో తక్కువ సమయంలో మరమ్మతు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నవ కవులకు మార్గదర్శి శ్రీశ్రీ

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వం ఉత్తమ విలువలతో కూడినదై సమాజ ఉన్నతికి దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఔత్సాహిక కవులు పూర్వ కవుల రచనలు ఎక్కువగా చదవాలని, నవ కవులకు మార్గదర్శి మహాకవి శ్రీశ్రీ అని తెలిపారు. నేటి నవ కవులందరూ శ్రీశ్రీ సాహిత్యాన్ని చదవాలని సూచించారు. డాక్టర్ కె.జి.వేణు తెలంగాణ ప్రజాకవి గూడ అంజయ్య జీవితం, సాహిత్యం గురించి ప్రసంగించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవి అంటే కృష్ణశాస్త్రి అని, ఆయన భవకవిత్వానికి ఆద్యుడని, సంస్కారవంతమైన కవిత్వం రాశారని తెలియజేశారు.